సాక్షి
ఖమ్మం
బుధవారం : 26 : జూలై : 2023



విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్
వర్షాలతో వాతావరణం చల్లబడగా విద్యుత్ వినియోగం గణనీయంగా పడిపోయింది. దీంతో కేటీపీఎస్‌లో ఉత్పత్తి తగ్గించారు. 10లో



వరి సాగుకు సిద్ధం
వైరా రిజర్వాయర్‌లోకి భారీగా వరద చేరుతుండగా ఆయకట్టు పరిధిలో వరి సాగు కోసం నీరు విడుదల చేయనున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
29° / 25°
వాతావరణం
జిల్లా అంతటా బుధవారం వర్షాలు కురిసే అవకాశముంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తుందని అధికారులు వెల్లడించారు.

న్యూస్‌రీల్

రేపు 'నిధి ఆప్ కే నిఖత్'

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న నిధి ఆప్ కే నిఖత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.డీ.సలీం ఖాన్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని సంస్థల యజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్ల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్ఓ) ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో సమస్యలు వెల్లడించి పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వాసులు కల్లూరులోని కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఆఫీస్ కార్యాలయంలో, భద్రాద్రి జిల్లా వాసులు పాల్వంచలోని మున్సిపల్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో గురువారం ఉదయం 9–30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

52 మందికి సదరమ్ సర్టిఫికెట్లు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో మంగళవారం సదరమ్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా స్లాట్ బుక్ చేసుకున్న 139 మందిలో 95 మంది దివ్యాంగులు హాజరయ్యారు. వీరికి పరీక్షలు నిర్వహించిన వివిధ విభాగాల వైద్యులు 52మందిని సదరమ్ సర్టిఫికెట్లకు అర్హులుగా నిర్ధారించారు.

ట్రాఫిక్ విభాగంలో ఏఆర్ ఉద్యోగులు

హైదరాబాద్ తరహా విధానం అమలు



ట్రాఫిక్ సీఐ అశోక్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏఆర్ ఎస్సై సాగర్

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో రోజుకురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను అరికట్టడానికి సీపీ విష్ణు ఎస్.వారియర్ వినూత్న విధానానికి శ్రీకారం చుట్టారు. ఈమేరకు హైదరాబాద్ కమిషనరేట్ తరహాలో ఇక్కడ కూడా ట్రాఫిక్ విభాగంలో ఏఆర్ ఉద్యోగులను కేటాయించారు. ఇందులో భాగంగా ముగ్గురు ఏఆర్ ఎస్ఐలను ట్రాఫిక్ విభాగానికి కేటాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరబాద్ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగంలో ఏఆర్ ఆర్ఐలు, ఎస్ఐల నుంచి కానిస్టేబుళ్లవరకు విధులు నిర్వర్తిస్తారు. ఖమ్మంలో కూడా ట్రాఫిక్ పెరుగుతుండడం, ఇటీవల ట్రాఫిక్ ఎస్ఐలు బదిలీ కావడంతో కొరత దృష్ట్యా ఏఆర్ ఉద్యోగులను నియమించినట్లు సమాచారం. ఈమేరకు మంగళవారం ఏఆర్ ఎస్ఐ సాగర్ బాధ్యతలు స్వీకరించగా, మరో ఇద్దరు త్వరలోనే విధుల్లో చేరతారు.

పరిశీలన వేగంగా చేపట్టండి

ఖమ్మం సహకారనగర్: ఓటర్లుగా నమోదు, సవరణల కోసం వచ్చిన దరఖాస్తులు వేగంగా పరిశీలిస్తూ పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సూచించారు. హైదరాబాద్ నుంచి మంగళవారం ఆయన వీసీ ద్వారా దరఖాస్తులు, పరిష్కారంపై సమీక్షించారు. జిల్లా నుంచి కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఫారం–6 కింద అందిన 33,933 దరఖాస్తుల్లో 28427, ఫారం–7 దరఖాస్తులు 11,511లో 6,798, ఫారం–8 కింద వచ్చిన 24,772 దరఖాస్తుల్లో 20,167 పరిష్కరించామని తెలిపారు. ఇంకా ఈ వీసీలో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, ఎస్‌డీసీ దశరథ్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం రూరల్: తీర్థాల వద్ద బ్రిడ్జి పైనుండి ప్రవహిస్తున్న ఆకేరు వాగు

జోరు తగ్గని వాన!

జిల్లాలో రెండు రోజులుగా భారీ వర్షాలు
- రిజర్వాయర్లు, చెరువులకు జలకళ
- 23 అడుగులకు చేరిన పాలేరు రిజర్వాయర్
- వాగులు పొంగడంతో పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు


సాక్షిప్రతినిధి, ఖమ్మం: వారం రోజులుగా జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు పడుతుండగా.. రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాల ధాటికి వాగులు పొంగి పొర్లడంతోపాటు రిజర్వాయర్లు, చెరువులు పూర్తి స్థాయిలో నిండుతున్నాయి. లో లెవెల్ చప్టాలపై నుంచి నీళ్లు ప్రవహిస్తున్న కారణంగా పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పాలేరు రిజర్వాయర్‌లోకి వరద భారీగా చేరి గరిష్టస్థాయి నీటిమట్టం నమోదు కావడంతో ఫాలింగ్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఇక భారీ వర్షాల నేపథ్యాన ఇప్పటికే కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూంకు తోడు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో మంగళవారం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. వరదకు సంబంధించి సాయం కోసం 79012 98265, 98664 92029 నంబర్లలో సంప్రదించాలని అధికారులు ప్రకటించారు.

విరామం లేకుండా..

సోమ, మంగళవారాల్లో జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఇదే భారీ వర్షం కాగా, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. అలాగే, పలుచోట్ల వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో పొలాల్లోకి వరద చేరింది. అలాగే, రహదారులపైకి నీరు చేరగా రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా మార్గాల్లో వాహనాల రాకపోకలను నిలిపేసిన అధికారులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

జలాశయాల్లోకి భారీగా వరద

జిల్లాలోని జలాశయాల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. కూసుమంచి మండలంలోని పాలేరు



కూసుమంచి : అలుగు పారుతున్న పాలేరు రిజర్వాయర్

జలాశయానికి ఎగువ నుంచి 8 వేల క్యూసెక్కుల నీరు చేరుతోంది. రిజర్వాయర్‌లో గరిష్ట నీటిమట్టం 23 అడుగులు దాటడంతో అలుగు పోస్తోంది. అలాగే, ఫాలింగ్ గేట్ల ద్వారా పాలేరు పాత కాల్వకు 200 క్యూసెక్కులు, నాగార్జునసాగర్ ఎడమకాల్వ ద్వారా 2 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇక వైరా రిజర్వాయర్ నీటిమట్టం 18.03 అడుగులకు గాను ప్రస్తుతం 17.9 అడుగులకు చేరింది. అలాగే లంకాసాగర్ ప్రాజెక్ట్, బేతుపల్లి చెరువుల్లోకి నీరు చేరడంతో పాటు జిల్లాలోని దాదాపు అన్ని చెరువులు పూర్తిగా నిండాయి. ఖమ్మంలోని మున్నేరులో ప్రస్తుతం 18 అడుగుల మేర నీరు ఉండగా.. రాత్రికి 20 అడుగుల వరకు చేరే అవకాశముందని చెబుతున్నారు. ఈమేరకు అధికారులు పరిశీలించి సమీప ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

రావినూతలలో 5.2 సెం.మీ. వర్షం

జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. అత్యధికంగా బోనకల్ మండలం రావినూతలలో 5.2 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది. అలాగే, ముదిగొండలో 5.1 సెంటీమీటర్లు, నేలకొండపల్లిలో 4.9, ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో 4.6, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో 4.5, కూసుమంచిలో 4.4, ముదిగొండ మండలం పమ్మి, ఖమ్మం ఖానాపురం పీఎస్ పరిధిలో 4.2, మధిర మండలం సిరిపురంలో 3.9, రఘునాథపాలెం, కొణిజర్ల మండలం పెద్ద గోపతిలో 3.7, ముదిగొండ మండలం బాణాపురంలో 3.6, ఖమ్మం ఎన్నెస్పీ అతిథిగృహం, కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో 3.5 సెం.మీ.ల వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు.



బోనకల్ : చిన్నబీరవల్లి వద్ద రహదారిపైకి నీరు చేరడంతో రాకపోకలను నిలిపేసిన అధికారులు

అప్రమత్తంగా ఉండండి : మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

మరో మూడు రోజుల పాటు భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. అధికారులు కార్యస్థానాల్లో అందుబాటులో ఉంటూ, పొంగి పొర్లుతున్న వాగుల వద్ద రాకపోకలు నిలిపేయాలని ఆదేశించారు. శిథిల భవనాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పువ్వాడ ఒక ప్రకటనలో సూచించారు.

నేడు మంత్రి పర్యటన

జిల్లా కేంద్రంలో మున్నేరులోకి భారీగా వరద చేరుతుండడంతో మంత్రి పువ్వాడ బుధవారం పరిశీలించనున్నారు. వరద పరిస్థితి, ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడంపై సమీక్షిస్తారు.

బాధ్యతగా పనిచేయండి



అభివృద్ధి నివేదికను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే వెంకటవీరయ్య, అదనపు కలెక్టర్ అభిలాష, అసిస్టెంట్ కలెక్టర్ రాధిక, జెడ్పీ సీఈఓ అప్పారావు

- సీజనల్ వ్యాధుల నివారణపై ముందస్తు చర్యలు
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో పలువురి సూచన

ఖమ్మం సహకారనగర్: క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది ఫొటోల కోసం కాకుండా బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని పలువురు ప్రజాప్రతినిధులు అభిప్రాయం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అధ్యక్షత వహించగా.. పలు మండలాల ప్రజాప్రతినిధులు అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ

సమావేశంలో విద్య, వైద్య రంగాలపై సమీక్ష నిర్వహించగా డీఎంహెచ్ఓ మాలతి మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లా 25 డెంగీ కేసులు నమోదు కాగా, అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ జోక్యం చేసుకొని సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పెనుబల్లి, వైరా, ఎర్రుపాలెం, బోనకల్, కారేపల్లి, తల్లాడ మండలాల కు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ అధికారులు ఫొటోల కోసమే హడావుడి చేస్తున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఆశ వర్కర్లతో పాటు ఏఎన్‌ఎంలు, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాల్సి ఉన్నా అలా చేయడం లేదని ఆరోపించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ తాతా మధు అధికారులతోపాటు ప్రజాప్రతినిధులకు అంతే బాధ్యత ఉంటుందని.. స్థానికంగా సమస్యలుంటే ప్రజాప్రతినిధులు పరిష్కరించాలని సూచించారు. ఇక గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పలువురు కోరారు.

ఎవరేం అన్నారంటే...

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇక సబ్ సెంటర్ల నిర్మాణాలు, మన ఊరు – మన బడి పనులు వేగంగానే జరుగుతున్నాయని తెలిపారు.
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ డెంగీ కేసులు లేవని అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే ఆతర్వాత బాధపడాల్సిన పరిస్థితి రాదని చెప్పారు.
- ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్య, వైద్యరంగాలకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. మెడికల్ కళాశాలల ఏర్పాటు, సబ్ సెంటర్ల నిర్మాణం, మన ఊరు – మన బడి, పనులతో మెరుగైన వసతులు సమకూరుతున్నాయని వివరించారు.
- అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో డ్రై డే – ఫ్రై డే పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. తొలుత గడిచిన పదేళ్లలో జరిగిన అభివృద్ధిపై రూపొందించిన పుస్తకంతో పాటుడెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఇంకా ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మున్నేరు బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేత

ఖమ్మంరూరల్: ఎడతెరిపి వర్షాలతో ఖమ్మం మున్నేరుకు వరద పోటెత్తి బ్రిడ్జికి సమీపానికి చేరింది. దీంతో మంగళవారం రాత్రి పొద్దుపోయాక మున్నేరు బ్రిడ్జిపై రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. ఎగువన కురిసిన వర్షాలతో ఇంకా వరద వస్తుండడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో వాహనాలను కరుణగిరి మీదుగా కొత్త బ్రిడ్జి పైనుంచి మళ్లించారు.



జలగంనగర్ వద్ద వాహనదారులు

గ్రామాల దిగ్బంధం.. భారీ బందోబస్తు

- గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణకు అడ్డంకులు రాకుండా చర్యలు
- కొదుమూరు, వందనం గ్రామాల్లో బారికేడ్ల నడుమ సర్వే

చింతకాని: మండలంలోని కొదుమూరు, వందనం గ్రామాల్లో భారీ పోలీసు బందోబస్తు నడుమ రెవెన్యూ, సర్వే అధికారులు సర్వే చేశారు. నాగపూర్–అమరావతి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి సంబంధించి భూమి సేకరించాల్సి ఉండగా.. ఆదివారం సర్వేకు వచ్చిన అధికారులను బాధిత రైతులు అడ్డుకున్నారు. దీంతో మంగళవారం తెల్లవారుజామునే అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యాన రెండు గ్రామాలను పోలీసులు దిగ్బంధించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా గ్రామాల నుంచి బయటకు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి నలుగురు ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, సుమారు 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేయగా.. రెవెన్యూ, సర్వే అధికారులు భూసర్వే పూర్తి చేశారు. ల్యాండ్ అండ్ సర్వే ఏడీ శ్రీనివాసులు ఆధ్వర్యాన చింతకాని, ఖమ్మం రూరల్, కొణిజర్ల తహసీల్దార్లు మూడు బృందాలుగా ఏర్పడి రెండు గ్రామాల్లో జాతీయ రహదారికి అవసరమైన 83ఎకరాలను గుర్తించారు. కాగా, జాతీయ రహదారితో ఉన్న కొద్దిపాటి భూములను కోల్పోతున్నందున పరిహారం పెంచాలని రైతులు పలువురు అధికారులకు విన్నవించారు. ఇప్పటికే దేవరపల్లి–సూర్యాపేట గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి కొంత భూమి కోల్పోగా ఇప్పుడు భూమి ఇస్తే జీవనోపాధి లేక రోడ్డున పడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ అండ్ సర్వే డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు, తహసీల్దార్లు మంగీలాల్, సుమ, సైదులు, ఏసీపీలు బస్వారెడ్డి, రవి, నర్సయ్య, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.



చింతకాని మండలం కొదుమూరులో సర్వే చేస్తున్న అధికారులు



కొదుమూరులో బారికేడ్ల వద్ద పోలీసులు

స్వల్పంగా పెరుగుతున్న గోదావరి

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి స్వల్పంగా పెరుగుతోంది. సోమవారం ఉదయం 36.5 అడుగులు ఉన్న నీటిమట్టం రాత్రి 8 గంటలకు 39 అడుగులకు చేరింది. తర్వాత నెమ్మదిగా పెరుగుతుండడంతో బుధవారం ఉదయం 42 అడుగులకు చేరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఎగువ ప్రాజెక్టుల నుంచి వస్తున్న వరదకు తోడు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కేటీపీఎస్‌లో నిలిచిన ఉత్పత్తి, పునరుద్ధరణ

పాల్వంచ : పాల్వంచలోని కేటీపీఎస్ 5వ దశ కర్మాగారంలో విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. 250 మెగావాట్ల సామర్థ్యం గల 9వ యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ లీకేజీని గుర్తించిన అధికారులు సోమవారం రాత్రి ఉత్పత్తిని నిలిపివేశారు. సీఈ ఎం.ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో మరమ్మతులు నిర్వహించి మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఉత్పత్తిని ప్రారంభించి రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేశారు.

సత్తుపల్లికి బీఎస్సీ నర్సింగ్ కళాశాల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య, పక్కన ప్రజాప్రతినిధులు, నాయకులు

- వచ్చే అక్టోబర్‌లో తరగతులు ప్రారంభం
- ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో సీఎం కేసీఆర్ రూ.25 కోట్లతో సత్తుపల్లికి బీఎస్సీ నర్సింగ్ కళాశాల మంజూరు చేశారని.. రానున్న అక్టోబర్‌లో తరగతులు మొదలవుతాయని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే సత్తుపల్లిలో వంద పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవానికి సిద్ధమవుతుండగా, కల్లూరు, పెనుబల్లిల్లో ఆస్పత్రుల నిర్మాణపనులు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే, ఇటీవల పాలిటెక్నిక్ కళాశాల కేటాయించిన కేసీఆర్, తాజాగా బీఎస్సీ నర్సింగ్ కళాశాలను మంజూరు చేయడంతో నిరుపేద యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. కాగా, ఎంపీ బండి పార్థసారథిరెడ్డి అండతో నియోజకవర్గంలోని 200మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించినట్లు సండ్ర తెలిపారు. ఈ విధంగా ఎవరైనా సరే అభివృద్ధిలో పోటీ పడొచ్చని మాజీ ఎంపీపొంగులేటి శ్రీనివాసరెడ్డికి సూచించారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు చేసిన అభివృద్ధిని తాను కొనసాగిస్తున్నానని.. ప్రస్తుతం రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్న విషయాన్ని గుర్తించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఆత్మ చైర్మన్ వనమా వాసు, ఎంపీపీలు దొడ్డా హైమావతి, లక్కినేని అలేఖ్యతో పాటు రఫీ, మల్లూరు అంకమరాజు, చల్లగుండ్ల కృష్ణయ్య, కోటగిరి సుధాకర్, మోదు గు పుల్లారావు, ఎస్.కే.అబ్దుల్లా, మాధురి మధు, అమరవరపు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం ఎమ్మెల్యే స్థానంపై హైకోర్టు తీర్పు



- అఫిడవిట్‌లో తప్పుడు సమాచార ఫలితం
- నాలుగేళ్లుగా విచారణ
- సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్న వనమా వెంకటేశ్వరరావు
- ఇక కొత్తగూడెం ఎమ్మెల్యేగా 'జలగం'

మీ ఎన్నిక చెల్లదు!

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా రాజకీయ ముఖచిత్రంలో మునుపెన్నడూ లేని పరిణామాలు చోటు చేసుకున్నాయి. గత సాధారణ ఎన్నికల్లో కొత్తగూడెం అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అనూహ్యంగా పదవి కోల్పోయారు. మరోవైపు వనమా గెలుపును సవాల్ చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన జలగం వెంకట్రావు చివరి నిమిషంలో ఎమ్మెల్యే పదవి చేపట్టనున్నారు.

అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం !

2018లో జరిగిన అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆయనకు ప్రత్యర్థిగా మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచారు.



వనమా వెంకటేశ్వరరావు



జలగం వెంకట్రావు

ఓట్ల లెక్కింపు సందర్భంగా ఇరువురి మధ్య గెలుపు దోబూచులాడింది. చివరకు సిట్టింగ్ ఎమ్మెల్యే వెంకట్రావుపై వనమా వెంకటేశ్వరావు 4,139 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అయితే నామినేషన్ దాఖలు సందర్భంగా ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో వనమా తప్పుడు సమాచారం అందించారంటూ 2019లో జలగం వెంకట్రావు హైకోర్టును ఆశ్రయించారు. గత నాలుగేళ్లుగా ఈ కేసు హైకోర్టు విచారణలో ఉంది.

అనర్హత వేటు.. జరిమానా

ఈ కేసు విషయంలో అటు వనమా, ఇటు జలగం ఇద్దరూ తమ తరఫున వాదనలు వినిపించారు. సుదీర్ఘ కాలం విచారణ కొనసాగగా, ఎన్నికల అఫిడవిట్‌లో వనమా కొన్ని చోట్ల తప్పుడు సమాచారం ఇచ్చారని, మరి కొన్ని చోట్ల ఇవ్వాల్సిన సమాచారాన్ని దాచి పెట్టారని రూఢీ అయింది. అన్ని అంశాలను క్రోఢీకరించి న్యాయమూర్తి జి.సుధారాణి మంగళవారం తుదితీర్పు ప్రకటించారు. ఇందులో సిట్టింగ్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుపై అనర్హత వేటు వేశారు. ఇదే సమయంలో వనమా సమీప అభ్యర్థిగా ఉన్న జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా ప్రకటించారు. గత అసెంబ్లీ సాధారణ ఎన్నికల ఫలితాలు వెలువడిన తేది 2018 డిసెంబర్ 12 నుంచి జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా పరిగణిస్తున్నట్టు న్యాయస్థానం తన తీర్పులో తెలిపింది. తప్పుడు సమాచారం ఇచ్చిన వనమా వెంకటేశ్వరరావుకు రూ.ఐదు లక్షల జరిమానా విధించింది.

ఈరోజు వాళ్లది కావొచ్చు..

'ఈరోజు వాళ్లది కావొచ్చు. కానీ రేపటి రోజు నాది. సుప్రీంకోర్టుకు వెళ్తాను. అక్కడ నా నిజాయితీ నిరూపించుకుంటా. కచ్చితంగా రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తాననే విశ్వాసం నాకుంది. నేను ప్రజలతో ఎన్నుకోబడిన వ్యక్తిని. దొంగ ఓట్లు, రిగ్గింగ్‌తో ఎమ్మెల్యే కాలేదు. కొత్తగూడెం ప్రజల మద్దతుతోనే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యా. ఇదే సమయంలో గౌరవ న్యాయస్థానం ఇచ్చిన ఇచ్చిన తీర్పునకు కట్టుబడి ఉంటా. నా నిజాయితీని సుప్రీంకోర్టుకు వెళ్లి నిరూపించుకుంటా. రాజకీయ క్షేత్రంలో గెలుపోటములు సహజం. నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో గెలిచినా, ఓడినా ప్రజల్లోనే ఉన్నాను. కానీ గత ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తి ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉండకుండా నాలుగేళ్లుగా కోర్టుల చుట్టే తిరుగుతున్నాడు. ఎవరు, ఎలాంటివారో ప్రజలకు బాగా తెలుసు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు' అని వనమా వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. మరోవైపు వనమా మద్దతుదారులు ఆయన ఇంట్లో సమావేశమయ్యారు. కోర్టు తీర్పుపై ఎలా వ్యవహరించాలనే అంశంపై చర్చించారు. పార్టీ అధినేత కేసీఆర్ సూచనలకు అనుగుణంగా ముందుకు వెళ్తామన్నారు. ఏం జరిగినా తామంతా వనమా వెంటే ఉంటామని ప్రకటించారు.

సంబరాల్లో జలగం వర్గీయులు

కోర్టు తీర్పు వచ్చిన మరుక్షణమే జలగం వర్గీయులు కొత్తగూడెంలో సంబరాలు చేసుకున్నారు. ఎక్కడికక్కడ వీధుల్లోకి వచ్చి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాయంత్రానికి కల్లా పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. తీర్పునకు సంబంధించిన కాపీలను తీసుకోవాల్సి ఉండడంతో జలగం వెంకట్రావు హైదరాబాద్‌లోనే ఉండిపోయారు.

క్లుప్తంగా

'టీ మేవా' జిల్లా చైర్మన్‌గా ఇస్మాయిల్


సయ్యద్ ఇస్మాయిల్

ఖమ్మంమామిళ్లగూడెం: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం(టీ మేవా) జిల్లా చైర్మన్‌గా సయ్యద్ ఇస్మాయిల్ నియమితులయ్యారు. ఈమేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డీ.మసూద్ అహ్మద్ సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ మాట్లాడుతూ జిల్లాలో మైనార్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పాటుపడతానని తెలిపారు. కాగా, ఆయనకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షఫీక్ అహ్మద్, సయ్యద్ అన్వర్‌తో పాటు ఇతర సంఘాల నాయకులు వెంకట్రామయ్య, రాజయ్య, అశోక్‌బాబు శుభాకాంక్షలు తెలిపారు.

సింగరేణిలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

సత్తుపల్లిరూరల్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కిష్టారం, సత్తుపల్లి జేవీఆర్ ఓసీల్లో మంగళవారం బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. జేవీఆర్ ఓసీలో 1.80 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ పనులు, 30వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. అలాగే, కిష్టారం ఓసీలో 45వేల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపు పనులు, 8వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని అధికారులు వెల్లడించారు.

అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లిన లారీ


ఘటనాస్థలంలో లారీ

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ వద్ద మంగళవారం ఓ లారీ అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లింది. ఇల్లెందు నుండి ఖమ్మం వస్తున్న లారీ దూసుకెళ్లి మట్టిలో చిక్కుకుని ఆగింది. ఈఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలతో బయటపడగా, పెనుప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

బిహార్ వలస కూలీకి అంత్యక్రియలు

ఖమ్మంవైద్యవిభాగం: బీహార్‌కు చెందిన వలస కూలీ రైలు ప్రమాదంలో మృతి చెందగా.. మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకెళ్లలేని పరిస్థితి ఉండడంతో అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. పొట్టకూటి కోసం బిహార్ నుండి తెలంగాణకు వస్తున్న లకిన్ మలం కుమార్ (26) ఇటీవల రైలు నుండి జారిపడి మృతి చెందాడు. ఆయన వద్ద ఆధారాల మేరకు కుటుంబీకులకు రైల్వే పోలీసులు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి మృతదేహాన్ని గుర్తించినా, స్వస్థలానికి తీసుకెళ్లలేని స్థితి ఉండడంతో అన్నం ఫౌండేషన్ బాధ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో మంగళవారం బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావుతోపాటు సభ్యులు, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి


సుందర్‌దాస్ (ఫైల్)

ఖమ్మంక్రైం: ఖమ్మం త్రీ టౌన్ ప్రాంతంలో లారీ ఢీకొనగా ఓ సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడు ఇందిరమ్మ కాలనీకి చెందిన పారబందపు సుందర్‌దాస్(57) భార్యతో కలిసి రమణగుట్టలో ఉండే కుమార్తె వద్దకు మంగళవారం వెళ్లాడు. అక్కడ భార్యను దించి వరంగల్ క్రాస్ రోడ్డులో తాను పనిచేసే సంస్థకు సైకిల్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో సుందర్‌దాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

బూర్గంపాడు: మండలంలోని లక్ష్మీపురంలో పట్టపగలే దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామానికి సమీప ఫ్యాక్టరీలో పనులకు వెళ్లి వస్తున్న మైనేని రాణి మెడలోని బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు లాక్కెళ్లారు. అయితే, ఆ సమయంలో ఆమె కేకలు వేస్తున్నా అటుగా ఎవరూ రాకపోవటంతో దుండగులు పరారయ్యారు. ఈమేరకు ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,800	1,800
మిర్చి	19,700	13,500
ఏసీ మిర్చి	24,100	18,500
పత్తి	7,100	5,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర రూ.12,623

పొంగి పొర్లి.. రాకపోకలు నిలిచి!

జిల్లావ్యాప్తంగా రోజంతా భారీ వర్షం

- పలుచోట్ల వాగులు ఉప్పొంగడంతో నిలిచిన రాకపోకలు

వారం రోజులుగా కురుస్తున్న వాన సోమవారం సాయంత్రం నుంచి జోరందుకుంది. మంగళవారం రోజంతా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉండడంతో జిల్లావ్యాప్తంగా అన్ని రిజర్వాయర్లు, చెరువులు, వాగుల్లోకి భారీగా నీరు చేరింది. పలుచోట్ల పత్తి చేలు, వరి నార్లను నీరు ముంచెత్తడంతో రైతులు నష్టపోయారు. ఇక చెరువులు ఉప్పొంగి ప్రవహించడంతో రహదారులపైకి నీరు చేరి రాకపోకలు నిలిచిపోయాయి.


కూసుమంచి మండలం నర్సింహులగూడెం-కిష్టాపురం వద్ద వాగు ప్రవాహం

- **బోనకల్:** మండలంలోని చిన్నబీరువల్లి, తూటికుంట్ల వాగులు ఉధృతంగా ప్రవహించాయి. చిన్నబీరువల్లి వాగు నీరు రోడ్డుపైకి చేరడంతో తహసీల్దార్ రమణి, ఎంపీడీఓ వేణుమాధవ్, పోలీసు సిబ్బంది హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేశారు.
- **మధిర:** మధిర మండలం చిలుకూరు వద్ద ఏపీ సరిహద్దులో ఉన్న బ్రిడ్జిపై కట్టలేరు నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నది ఆవలి వైపు ఉన్న ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం పల్లెంపల్లికి రాకపోకలు స్తంభించాయి. మధిరలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ద్విచక్ర వాహనాలు, పాదచారుల రాకపోకలు సాగించలేకపోయారు.
- **తిరుమలాయపాలెం:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని ఆకేరు ఏరు ఉగ్రరూపం దాల్చింది. డలంలోని హైదర్‌సాయిపేట, బీసురాజుపల్లితండా వద్ద ఆకేరు ఏటీ పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ భూముల నుండి ఆకేరు వరద ప్రవహించడంతో వ్యవసాయ మోటార్లు మునిగిపోయినట్లు రైతులు తెలిపారు. ఇక బచ్చోడు, సుబ్లేడు, రాజారం, బంధంపల్లి, బీరోలు చెరువులు అలుగుదశలకు చేరినట్లు ఇరిగేషన్ ఎఈ రామకృష్ణ తెలిపారు.
- **ఎర్రుపాలెం:** భారీ వర్షాలతో కట్లేరులోకి భారీగా వరద నీరు చేరింది. తక్కెళ్లపాడు-బనిగండ్లపాడు మధ్య కట్లేరు పొంగి రోడ్డుపైకి నీరు చేరడంతో ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, సర్పంచ్ కూరపాటి సుందరమ్మ ఆధ్వర్యాన రాకపోకలు నిలిపివేశారు.
- **కూసుమంచి:** పాలేరు రిజర్వాయర్‌కు ఎగువ నుండి భారీగా వరద వస్తోంది. కొత్తూరు-నర్సింహులగూడెం మధ్య వాగు నుండి భారీగా వరద చేరుతుండగా రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని నర్సింహులగూడెం వద్ద ఉన్న రాతిబంధం వాగు పొంగగా పోలీసులు రక్షణ చర్యలు చేపట్టారు. పాలేరు నీటిమట్టం 23 అడుగులకు గాను గరిష్టస్థాయికి చేరడంతో ఎడమ కాల్వకు 2వేల క్యూసెక్కులు, పాలేరు కాల్వకు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. నీటిపారుదలశాఖ ఎస్ఈ నర్సింహారావు, ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఈలు మధు, రత్నకుమారి, ఎస్సై రమేష్‌కుమార్ ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటుచేశారు.
- **నేలకొండపల్లి:** మండలంలోని నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం, చెరువుమాధారం, ఆరెగూడెం, రాజేశ్వరపురం తదితర గ్రామాల్లో వరి నారు మళ్లు నీట మునిగాయి. ఇక చెరువుమాధారం, నేలకొండపల్లి కట్టలమ్మ, బాలసముద్రం చెరువులకు భారీగా వరద చేరగా నేలకొండపల్లి లోని నిదానం కత్తువ అలుగు పోస్తోంది.
- **వైరారూరల్:** మండలంలోని పలు గ్రామాల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పంట పొలాల్లో వర్షపు నీరు చేరింది.
- **ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం:** మున్నేరుపై ఉన్న కామంచికల్ వద్ద ఉన్న చెక్ డ్యాం, నగరంలోని ప్రకాష్‌నగర్ చెక్ డ్యాం పొంగి పొర్లుతున్నాయి. రఘునాథపాలెం మండలం పాపటపల్లి - వీఆర్ బంజర మధ్య ఉన్న నిమ్మ వాగులో కూడా భారీగా వరద చేరింది. ఖమ్మంలోని కొత్తగూడెం చెరువు సైతం అలుగు పారుతోంది.
- **ఖమ్మంరూరల్:** మండలంలోని తీర్థాల వద్ద ఆకేరు పొంగి ప్రవహిస్తోంది. ఆకేరు బ్రిడ్జిపై నుండి వరదనీరు వెళ్తుండడంతో ఖమ్మం నుండి మంగళగూడెం వరకు రాకపోకలు నిలిచాయి. తీర్థాలలోని ఓ రైతుకు చెందిన ఆవు మేతకు వెళ్లివస్తూ ఆకేరు దాటుతుండగా వరద ప్రవాహానికి కొట్టుకుపోతూ నెమ్మదిగా ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకొంది.
- **తల్లాడ:** మండంలోని చెరువులు, కుంటలు అలుగులుపారాయి. బిల్లుపాడు-రామచంద్రాపురం వాగు, మిట్టపల్లి వద్ద గంగదేవిపాడు వాగు, కుర్నవల్లి వాగు, గొల్లగూడెం జూబందం వాగు, వెంగన్నపేట కల్లూరు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.
- **కామేపల్లి(కారేపల్లి):** కామేపల్లి మండలంలోని చెరువులు వరద నీటితో కళకళలాడాయి. ఇల్లెందు, కారేపల్లి మండలాల్లో వర్షం కురవడంతో బండిపాడు వద్ద బుగ్గవాగు ఉధృతంగా ప్రవహించింది.
- **ఏన్కూరు:** మండలంలోని చెరువుల్లోకి భారీగా నీరు చేరింది. రేపల్లెవాడ, నాచారం మధ్య ఉన్న వాగు పొంగి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోగా, లోతట్టు ప్రాంతాల్లోని పత్తి చేలు నీట మునిగాయి.


అలుగు పారుతున్న ఖమ్మంలోని కొత్తగూడెం చెరువు


మధిరలోని అంబారుపేట చెరువును పరిశీలిస్తున్న సీతా శంకర్‌నాయక్, అధికారులు


కామంచికల్‌లో తీర్థాల చెక్‌డ్యాం నుంచి దిగువకు వెళ్తున్న వరద


తల్లాడ మండలం కొత్త వెంకటగిరి-బిల్లుపాడు మధ్య లోలెవల్ బ్రిడ్జిపై నీరు


ఎర్రుపాలెం మండలం తక్కెళ్లపాడు-బనిగండ్లపాడు మధ్య రాకపోకలను నిలిపేసిన అధికారులు


తిరుమలాయపాలెం మండలం బీసురాజుపల్లి తండా వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరు


పాలేరు రిజర్వాయర్ ఎడమ కాల్వలో పారుతున్న నీరు


నేలకొండపల్లిలో అలుగు పోస్తున్న నిదానం కత్తువ


మధిర సమీపాన ఉధృతంగా ప్రవహిస్తున్న కట్టలేరు నది

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


పట్టాలు అందుకున్న విద్యార్థులతో కలెక్టర్ గౌతమ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్, కళాశాల చైర్మన్ కృష్ణ తదితరులు

ఎస్‌బీఐటీ గ్రాడ్యుయేషన్ డేలో కలెక్టర్ గౌతమ్


విద్యార్థినికి పట్టా అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతస్థాయికి ఎదగాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ సూచించారు. నగరంలోని ఎస్‌బీఐటీలో 2019–2023 ఇంజనీరింగ్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ విద్యార్థులు బ్రాంచ్ ఏదైనా ఎంచుకున్న లక్ష్యాన్ని మరువకూడదన్నారు. నిత్యం నేర్చుకోవాలనే తపన కలిగిఉండాలని, సమాజంలో ఉన్నత స్థాయికి చేరాలంటే శాస్త్ర, సాంకేతిక రంగంలో రానున్న మార్పులపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ విద్యార్థులు డబ్బు వెనక పరుగెత్తకుండా నూతన ఆవిష్కరణలపై దృష్టి సారిస్తే డబ్బే మన దగ్గరకు వస్తుందని తెలిపారు. అనంతరం కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ తమ కళాశాలలో కోర్సు పూర్తిచేసే లోగా ఉద్యోగాలు సాధించేలా కృషి చేస్తున్నామని, ఇప్పటి వరకు 293 ప్లేస్‌మెంట్లు నమోదయ్యాయని చెప్పారు. ఈకార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు ఏవీవీ.శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, సుభాష్‌చందర్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గంధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో మంటలు ఆర్పండి

సీపీఎం, సీపీఐ ఆధ్వర్యాన ప్రదర్శన


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మణిపూర్‌లో మూడు నెలలు జరుగుతున్న హింసాత్మక ఘటనలపై కేంద్రం స్పందించి పరిస్థితులు చక్కబడేలా చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ డిమాండ్ చేశారు. సీపీఎం, సీపీఐ ఆధ్వర్యాన మంగళవారం ఖమ్మంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వారు మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతియుతంగా జీవనం కొనసాగిస్తున్న ప్రజల మధ్య మతోన్మాద ప్రభుత్వం చిచ్చుపెట్టిందని విమర్శించారు. గిరిజన చట్టాలను అతిక్రమించి మైతిలను గిరిజనులుగా మార్చడానికి ఒడిగట్టడంతో ఆందోళనలు మొదలయ్యాయని తెలిపారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ రాష్ట్రప్రభుత్వం బాధ్యత వహించి దోషులను కఠినంగా శిక్షించాలని, అక్కడ శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు ఎర్ర శ్రీకాంత్, ఎం.సుబ్బారావు, బండి రమేష్, యర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఏపూరి లతాదేవి, ఎర్రబాబు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వర్‌రావు, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, మహమ్మద్ సలాం, మేకల శ్రీనివాసరావు, ఎస్‌కే.బషీర్, దొంగల తిరుపతిరావు, పిన్నింటి రమ్య, బండారు యాకయ్య, బోడపట్ల సుదర్శన్, ప్రవీణ్, వై శ్రీనివాసరావు, భూక్యా శ్రీనివాసరావు, బత్తిని ఉపేందర్, కత్తుల అమరావతి, ఇటికల రామకృష్ణ, తాటి నిర్మల, బెజవాడ రవి, గాదె లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే పొంగులేటి విమర్శలు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధు, పక్కన డీసీసీబీ చైర్మన్ నాగభూషణం తదితరులు

ఖమ్మం వైరారోడ్: రాజకీయ లబ్ధి కోసమే మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తరచుగా బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ ఆరోపించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక ధనిక, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ముఖ్యమంత్రి కేసీఆర్ తీర్చిదిద్దారన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను ఆరాధ్యదైవంగా భావిస్తుండడంతో తట్టుకోలేక రాష్ట్రాన్ని మళ్లీ చీకట్లోకి నెట్టాలని ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. కాగా, కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీ శ్రీనివాసరెడ్డి కేసీఆర్‌ను తిట్టడమే అజెండాగా పెట్టుకున్నారని, ఏ వ్యక్తి నుంచి లబ్ధి పొందాడో అదే వ్యక్తిని విమర్శించడం గర్హనీయమని పేర్కొన్నారు. ఇదేక్రమంలో నాలుగు సార్లు గెలిచిన ఎమ్మెల్యే సండ్ర వెంటకవీరయ్యను విమర్శించటం తగదని సూచించారు. కాంగ్రెస్‌లో చేరిన ఆయన రాజకీయాలు చేసుకుంటే మంచిదని, ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే మాత్రం సహించేది లేదని మధు హెచ్చరించారు. ఈసమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు చింతనిప్పు కృష్ణచైతన్య, ఉప్పల వెంకటరమణ, బొమ్మెర రామ్మూర్తి, బెల్లం వేణు, యలమద్ది రవి, పగడాల నాగరాజు, లింగనబోయిన సతీష్ పాల్గొన్నారు.

వరి సాగుకు సిద్ధం

- వైరా రిజర్వాయర్‌లో 17.9 అడుగుల మేర నీరు
- ఇప్పటికే నార్లు పోసుకున్న అన్నదాతలు
- నేడు రైతులతో సమావేశం అనంతరం నీటి విడుదల


రైతులు సిద్ధం చేసుకున్న నారుమడి

వైరా: జిల్లాలో అన్నపూర్ణగా పేరొందిన వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో వరి సాగకు రైతులు సిద్ధమవుతున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రిజర్వాయర్‌లోకి వరదనీరు భారీగా చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 18.3 అడుగులు కాగా, మంగళవారం సాయంత్రానికి 17.9 అడుగులుగా నమోదైంది. దీంతో రిజర్వాయర్ ఆయకట్టు రైతులు ఇప్పటికే వరి నారు సిద్ధం చేసుకోగా.. నీరు విడుదల చేయగానే నాట్లు వేయనున్నారు.

23 వేల ఎకరాల్లో సాగు

రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో 23 వేల ఎకరాల్లో ఏటా వరి సాగవుతుంది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలోని రైతులే కాక చెరువులు, బోర్ల కింద నాట్లకు మరికొందరు సిద్ధమవుతున్నారు. మండలంలోని సోమవరం, తాటిపూడి, రెబ్బవరం, సిరిపురం, విప్పలమడక, కోష్టాల, ముసలిమడుగు, లక్ష్మీపురం, లింగన్నపేట గ్రామాల రైతులు ఇప్పటికే నారు పోశారు. అయితే, ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో ఆందోళన చెందారు. కానీ వారం రోజులుగా భారీ వర్షాలు కురవడం, రిజర్వాయర్‌లోకి భారీగా నీరు చేరడంతో హర్షం వ్యక్తమవుతోంది.

సన్న రకాలకే మొగ్గు

రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో రైతులు వరి సన్న రకం సాగుకు మొగ్గు చేపుతున్నట్లు తెలుస్తోంది. 140రోజుల్లో పంట చేతికొచ్చే ఎంటీయూ 1224, బీపీటీ 5204, ఎంటీయూ 1262, ఆర్ఎన్ఆర్ 15048 రకాలే కాక మధ్య, స్వల్పకాలిక రకాలైన 120 రోజుల్లో చేతికి వచ్చే 1010, 1061 రకాలను సాగు చేస్తారు. ఆయా రకాలను సుమారు 12 వేల ఎకరాల్లో సాగు చేయనున్నట్లు అంచనా వేయగా.. మిగతా రైతులు 1010 రకం సాగు చేస్తారు.

సన్న రకాలే అధికంగా సాగు....



రిజర్వాయర్ ఆయకట్టులో ఏటా అధికంగా సన్న రకాలే సాగుచేస్తున్నారు. రైతులు ఇప్పటికే నార్లు సిద్ధం చేసుకున్నారు. రైతులకు కావాల్సిన అన్ని రకాల ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. అలాగే, నకిలీలు మార్కెట్‌లోకి రాకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం.

– ఎస్.పవన్ కుమార్, ఏఓ, వైరా

నీటి విడుదలపై నేడు సమావేశం



రిజర్వాయర్‌లో ప్రస్తుతం 17.9 అడుగుల మేర నీరు ఉంది. నారుమడులకు నీటి విడుదల కోసం బుధవారం రైతులతో సమావేశం నిర్వహిస్తున్నాం. రెండు రోజుల్లో ఆయకట్టుకింద నారుమడులకు నీరు విడుదల చేసే అవకాశముంది.

– శ్రీనివాస్, డీఈ, ఐబీ, వైరా

పునరావాస కేంద్రాలకు తరలింపు

- మున్నేరు పరిసరాలను పరిశీలించిన కలెక్టర్


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మంలోని మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తుండగా.. మంగళవారం రాత్రికి ప్రవాహం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. ఈమేరకు కాల్వొడ్డు వద్ద మున్నేరు ఉధృతి, ముంపుకు గురయ్యే అవకాశమున్న ప్రాంతాలను కలెక్టర్ గౌతమ్ మంగళవారం రాత్రి పరిశీలించారు. ఈసందరభంగా ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందు జాగ్రత్త చర్యగా పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. మున్నేరు రాత్రి 8గంటలకు 18 అడుగులుగా ఉండగా, 9గంటలకల్లా 19 అడుగులకు చేరిందని తెలిపారు. మరింత పెరిగే అవకాశముండడంతో నయాబజార్ పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలకు మోతీనగర్, బొక్కలగడ్డ ప్రాంతాల ప్రజలను తరలించాలని అధికారులకు సూచించారు. అలాగే, మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, మత్స్య, విద్యుత్ శాఖల ఉద్యోగులు రాత్రంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. మున్నేరు వంతెనపై రాకపోకలు నిషేధించి ట్రాఫిక్‌ను మళ్లించాలని సూచించారు. కేఎంసీ డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, మున్సిపల్ ఈఈ కృష్ణాలాల్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, మత్స్య శాఖాధికారి ఆంజనేయస్వామి, తహసీల్దార్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన పూరిగుడిసె


వర్షానికి కూలిన గుడిసె

ఎర్రుపాలెం: భారీ వర్షాలకు మండలంలోని పెగళ్లపాడు గ్రామంలో షేక్ రఫీ సాహెబ్‌కు చెందిన పూరిగుడిసె కూలిపోయింది. గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో గోడలు నానిపోగా నేలకూలాయి. కాగా, నిరుపేద అయిన రఫీ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ సగ్గుర్తి రాజేశ్వరి, ఎంపీటీసీ సగ్గుర్తి కిశోర్ తదితరులు కోరారు.

క్లుప్తంగా...


రాష్ట్రపతితో జయధీర్ తిరుమలరావు

రాష్ట్రపతి భవన్‌లో ఆదివాసీ కళా ప్రదర్శన

ద్రౌపదీముర్ము బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతిగా ద్రౌపదీ ముర్ము బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా భారత ప్రభుత్వం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం పాత తివాచీల మ్యూజియంలో సూత్ర కళాదర్పణ్, జనజాతి దర్పణ్ పేర్లతో ఆదివాసీ కళాప్రదర్శన నిర్వహించింది. ఈ ప్రదర్శనలో ఆదివాసీ స్వాతంత్ర్య ఉద్యమ వీరుల చిత్రపటాలు, వ్యవసాయ పరికరాలు, లోహ కళాఖండాలను, ఆదివాసీ జీవిత ఛాయాచిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో రాష్ట్రపతితో పాటు ఇందిరాగాంధీ రాష్ట్రీయ కళాకేంద్రం మెంబర్ కార్యదర్శి సచ్చిదానం జోషి, హైదరాబాద్ ఆద్యకళా మ్యూజియం డైరెక్టర్ జయధీర్ తిరుమలరావు, జానపద సంపద విభాగం అధిపతి కె.అనిల్‌కుమార్, అరుణ్ కుమార్‌రెడ్డి, సతీశ్‌లాల్ తదితరులు పాల్గొన్నారు. ప్రదర్శనలోని కళాఖండాలను తిలకించి ఇలాంటి అతిపెద్ద మ్యూజియం ఏర్పాటుకు ఇది తొలి అడుగు అని పలువురు అభిప్రాయపడ్డారు. ఇందులో సగానికి పైగా కళా ఖండాలను ప్రదర్శించిన హైదరాబాద్ ఆద్యకళా మ్యూజియం వారిని రాష్ట్రపతి అభినందించారు.

మైహోం సిమెంట్ పరిశ్రమలో ప్రమాదం

మేళ్లచెరువు: సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రం పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మైహోం సిమెంట్ పరిశ్రమలో 4వ ప్లాంట్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. అందులో నాల్గవ అంతస్తు స్లాబ్ పనులు చేస్తుండగా దాని కింద నుంచి రెడిమిక్స్‌ను బ్లోయర్ ద్వారా పై అంతస్తులకు చేరవేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో రెడిమిక్స్ పైకి పంపిస్తుండగా జామ్ కావడంతో ఆ నలుగురు కార్మికులు పైపులను సరిచేస్తుండగా ఒక్కసారిగా 40 మీటర్ల ఎత్తులో పైపులు విరిగి పోవడంతో వారు కింద పడిపోయారు. వారిలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అరవింద్ సింగ్ (32) మృతిచెందగా.. రాజాసింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

దారుణంగా దర్యాప్తు

వివేకా హత్య కేసులో కల్పిత కథనాలతో డైలీ సీరియల్‌లా సీబీఐ ఛార్జ్ షీట్: సజ్జల



సాక్షి, అమరావతి: సీబీఐ లాంటి ప్రతిష్టాత్మక సంస్థ కూడా చెత్తగా దర్యాప్తు చేస్తుందనేందుకు మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిదర్శనంగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేని గుంట నక్కలకు సీబీఐ వేదికగా మారిందని మండిపడ్డారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల సీబీఐ దాఖలు చేసిన సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ మొత్తం కల్పిత కథేనని కొట్టిపారేశారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు బాకాలు ఊదే ఎల్లో మీడియాకు నాలుగు రోజులు మసాలా కథనాలు వండివార్చడానికి మాత్రమే సీబీఐ ఛార్జ్‌షీట్ ఉపయోగపడుతుంది కానీ ఈ డైలీ సీరియల్ న్యాయస్థానాల్లో నిలబడదని తేల్చి చెప్పారు. వైఎస్ భారతమ్మ, తాను కలిసి సునీతమ్మ ఇంటికే వెళ్లలేదని సజ్జల స్పష్టం చేశారు. అలాంటప్పుడు ఎంపీ అవినాశ్‌రెడ్డిని వెనకేసుకురావాలని సునీతమ్మను తాను ఎలా కోరుతానని ప్రశ్నించారు. సునీతమ్మ పచ్చి అబద్ధాలు చెబుతున్నట్లు స్పష్టమవుతోందన్నారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

ఆ మాత్రం ఇంగిత జ్ఞానం లేదా?

ఎలాంటి ఆధారాలు లేకున్నా కేవలం వ్యక్తుల వాంగ్మూలాలను కల్పిత కథకు అనుకూలంగా మారుస్తూ సీబీఐ ఛార్జ్‌షీట్లు దాఖలు చేస్తోంది. వైఎస్ వివేకా హత్య వల్ల నష్టం ఎవరికి? అని ప్రశ్నిస్తే.. వైఎస్సార్ సీపీకి, జగన్‌కే అని చిన్న పిల్లాడైనా చెబుతాడు. ఇంకా చెప్పాలంటే నాడు కడప ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అవినాశ్‌రెడ్డికి నష్టం. రాజకీయంగా ఆత్మహత్య చేసుకోవాలని ఆయన ఎందుకు అనుకుంటారు? ఏ చిన్న దర్యాప్తు సంస్థ అయినా, ప్రైవేట్ డిటెక్టివ్ సంస్థకైనా ఈమాత్రం ఇంగితం ఉంటుంది. వివేకా హత్య కేసును రెండు సిట్‌లు దర్యాప్తు చేశాయి. అవి సేకరించిన కాల్ రికార్డ్స్, డేటాను సీబీఐ ఏం చేసిందో తెలియదు.

వ్యవస్థల్లోకి వైరస్‌లా చంద్రబాబు..

అన్ని వ్యవస్థల్లో వైరస్‌లా పాకిన చంద్రబాబు తన అనుచరులతో జాతీయ స్థాయిలో మేనేజ్ చేసేలా చక్రం తిప్పుతున్నారు. వివేకా హత్య వల్ల నాడు అధికారంలో ఉన్న చంద్రబాబుకు రెండు లాభాలు. ఒకటి వైఎస్ జగన్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం.. రెండోది.. పాదయాత్ర పూర్తిచేసి అభ్యర్థులను ప్రకటించేందుకు సిద్ధమైన వైఎస్ జగన్‌ను తేరుకోనివ్వకుండా చేయడం.

ప్రత్యర్థుల క్యాంపులో సునీతమ్మ..:

కారణాలు ఏమిటో తెలియదుగానీ వివేకా కుమార్తె సునీతమ్మ ఆ తర్వాత వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే ఆమె పూర్తిగా ప్రత్యర్థుల క్యాంపులోకి వెళ్లినట్లు అనిపించింది. కథ మలుపు తిరగాలన్నప్పుడల్లా వారికి అనుగుణంగా ఆరేడు సార్లు సునీతమ్మ స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. వారికి కావాల్సిన స్టేట్‌మెంట్లు తీసుకుంటూ ఇన్వెస్టిగేషన్ రివీల్డ్ అంటున్నారు. సునీల్ యాదవ్ అనే నిందితుడు బెయిల్‌కి దరఖాస్తు చేసినప్పుడు గూగుల్ టేకవుట్‌ను తెరపైకి తెచ్చి అవినాశ్‌రెడ్డి తండ్రిని లోపల పెట్టేశారు. గూగుల్ టేకవుట్ ఈ కేసులో నిలబడదని తెలియగానే యూనివర్సల్ టైమ్ కో–ఆర్డినేటర్ ప్రకారం మన సమయానికి 5.30 గంటలు కలపాలన్నారు. ఆ లెక్కన వారు చెప్పిన టైం మరుసటి రోజు 8 గంటలు కావడంతో దాన్ని పక్కన పెట్టేశారు. అది నిలబడదని వారికీ అర్థమైంది.

తెలంగాణ హైకోర్టు ప్రశ్నించడంతో..

తెలంగాణ హైకోర్టు గత మే 31న మొదటిసారిగా కేసును క్షుణ్ణంగా పరిశీలించి సీబీఐని పలు ప్రశ్నలు అడిగింది. మేం ముందు నుంచీ వ్యక్తం చేస్తున్న సందేహాలే అవి. అవినాశ్‌రెడ్డి జూన్ 19న సీబీఐ డైరెక్టర్‌కి లేఖ రాయడంతో సునీతమ్మ స్టేట్‌మెంట్ మరొకటి రికార్డు చేశారు. హింసాత్మక సంఘటనలు జరుగుతాయనే లేఖను బయట పెట్టలేదని సునీతమ్మ చెబుతున్నారు. అది అసహజం. సొంత తండ్రి చనిపోయినా లేఖ విషయాన్ని పట్టించుకోలేదంటే ఎలా నమ్మడం?

పది రోజుల తర్వాత పరామర్శకు వెళ్లా..

2019 మార్చి 23వ తేదీన భారతమ్మ వచ్చి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పినట్లు చేయమన్నారని సునీతమ్మ స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారు. అవినాశ్‌ను సమర్థించాలని నేను కోరినట్లు కథ అల్లారు. ఆ రోజు భారతమ్మ, నేను కలిసి ఆమె ఇంటికి వెళ్లలేదు. వివేకా హత్య జరిగిన తర్వాత పది రోజులకు నా భార్యతో కలసి పరామర్శించడానికి వెళ్లా. బాగా షాక్‌తో ఉంటారనుకున్నాగానీ అంత ఇదిగా అయితే కనిపించలేదు. షాకింగ్ సంఘటన జరిగినప్పుడు మొదట ఇంటికి పెద్దలా ఉన్న వైఎస్ జగన్‌కు ఫోన్ రావాలి. కానీ సునీతమ్మ వైపు నుంచి ఫోన్ రాలేదు. వివేకా వ్యక్తిత్వాన్ని హననం చేసిన ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, ఈనాడు ఈరోజు ఆమెకు మిత్రులు, సలహాదారులు, సన్నిహితులు. వివేకాకు మచ్చ రాకూడదని అవినాశ్‌రెడ్డి కుటుంబం మూడేళ్లు మౌనంగా అన్నీ భరించింది. చనిపోయిన వ్యక్తి గౌరవాన్ని కాపాడాలని మేం తపన పడుతుంటే బతికున్నవారినే సునీతమ్మ బజారుకీడుస్తున్నారు. బతుకులను నాశనం చేసే పరిస్థితికి వచ్చాక మౌనం వీడి నోరు తెరవాల్సి వస్తోంది.

వివేకా కోసం అవినాష్ ధర్నా

నిజానికి నాడు వివేకాకు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని జగన్‌కు ప్రతిపాదన చేసింది అవినాశే. ఒక ఎంపీటీసీని టీడీపీ నేతలు ఎత్తుకెళితే వివేకా కోసం అవినాశ్‌రెడ్డి స్వయంగా ధర్నాకు కూర్చున్నాడు. 2011లో పార్టీ పెట్టినప్పటి నుంచీ పులివెందుల విషయంలో తన ప్రతినిధిగా అవినాశ్‌ను జగన్ ఎంపిక చేసుకున్నారు. వైఎస్సార్‌కు వివేకా ఎలాగో ఇప్పుడు జగన్‌కు కూడా అవినాష్ అలానే.

గుంట నక్కలకు వేదిక..

వివేకాను వారే హత్య చేశారనేందుకు పది పన్నెండు కారణాలున్నాయి. ఆస్తి, కుటుంబ పరువు విషయాలే ప్రధానంగా హత్యలకు దారి తీస్తాయి. వివేకా చెక్ పవర్‌ను రద్దు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివేకా రెండో భార్య షమీమ్ స్టేట్‌మెంట్లో అన్నీ ఉన్నాయి. వివేకా బావమరిది శివప్రకాశ్‌రెడ్డి బెదిరించాడని, మనుషులను పంపించాడని ఆమె స్టేట్‌మెంట్ ఇచ్చింది. దీనిపై సీబీఐ ఎందుకు విచారించదు? అన్ని శక్తులు ఉడిగిపోయిన గుంటనక్కలన్నీ ఒకచోట చేరి సీఎం వైఎస్ జగన్‌ను రాజకీయంగా దెబ్బతీసేందుకు సీబీఐని వేదికగా చేసుకుంటున్నాయి. పది బండలు వేస్తే ఒకటన్నా నమ్మకపోతారా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే కోర్టు ఒకసారి మొట్టికాయలు వేసింది. న్యాయమూర్తి అమ్ముడుపోయాడంటూ ఆంధ్రజ్యోతి డిబేట్‌లో నేరుగా బురద చల్లే దుస్సాహసానికి ఒడిగట్టింది. జర్నలిజం పేరుతో బెదిరింపులకు పాల్పడుతూ ఉగ్రవాదుల కంటే దారుణంగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు, ఎల్లో మీడియా కరివేపాకులా సునీతమ్మను వాడుకుంటున్నారు. ఎన్నికలు ముగియగానే ఆమెను అనాథలా పక్కన పెట్టడం ఖాయం.

దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి ట్రైనింగ్

ఆధారాలు, పరిసరాలు, హత్యలో పాల్గొన్న వ్యక్తులు ఇలా అన్నీ ఒక వైపు చూపిస్తుంటే.. దర్యాప్తు మరోవైపు సాగుతోంది. ఎప్పుడైతే సునీతమ్మ ఆలోచన విధానం మారిందో అప్పుడే కేసును బలవంతంగా తిప్పడం మొదలుపెట్టారు. చంద్రబాబుకు లాభం చేకూరేలా మార్చారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో సిద్ధహస్తులు కాబట్టి సీబీఐ చేతికి వచ్చాక వారికి తగ్గట్లుగానే అన్నీ జరుగుతూ వచ్చాయి. అవినాశ్‌రెడ్డి వైపు వేలు చూపించేందుకు దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి రెండు మూడు నెలలు ట్రైనింగ్ కూడా ఇచ్చారు.

జస్టిస్ సామ్ కోషి బాధ్యతల స్వీకరణ రేపు

ప్రమాణం చేయించనున్న హైకోర్టు సీజే

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టుకు న్యాయమూర్తిగా బదిలీ అయిన జస్టిస్ సామ్ కోషి ఈ నెల 27న బాధ్యతలు చేపట్టనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు హైకోర్టు మొదటి హాల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ హైకోర్టులో పనిచేస్తున్న జస్టిస్ సామ్ కోషిని సుప్రీం కోర్టు కొలీజియం తొలుత మధ్యప్రదేశ్‌కు సిఫార్సు చేయగా, వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీంతో సుప్రీంకోర్టు కొలీజియం ఆయనను తెలంగాణ హైకోర్టుకు సిఫార్సు చేయగా, రాష్ట్రపతి ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే.

1991లో న్యాయవాదిగా ఎన్‌రోల్

జస్టిస్ సామ్ కోషి మధ్యప్రదేశ్‌లో 1967, ఏప్రిల్ 30న జన్మించారు. జబల్‌పూర్‌లోని జీఎస్ కళాశాల నుంచి కామర్స్‌లో డిగ్రీ పట్టా పొందారు. రాణి దుర్గావతి విశ్వవిద్యాలయం నుంచి న్యాయ విద్య పూర్తిచేసి 1991, మార్చి 9న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. రాజ్యాంగం, సివిల్, సర్వీస్, లేబర్ అంశాల్లో ఎక్కువగా కేసులు వాదించారు. 2000 నుంచి 2013 వరకు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ హైకోర్టుల్లో న్యాయవాదిగా పనిచేశారు. ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, ప్రైవేట్ సంస్థలు, సౌత్‌ఈస్ట్ సెంట్రల్ రైల్వే, కోల్ ఇండియా లిమిటెడ్, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎస్‌బీఐ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర విద్యుత్ బోర్డులకు కౌన్సిల్‌గా వ్యవహరించారు. 2002 నుంచి 2004 వరకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ న్యాయవాదిగా బాధ్యతలు నిర్వహించారు. 2005 నుంచి 2006 వరకు డిప్యూటీ అడ్వొకేట్ జనరల్‌గా పనిచేశారు. 2013, సెప్టెంబర్ 16న ఛత్తీస్‌గఢ్ హైకోర్టు అడిషనల్ జడ్జిగా నియామితులయ్యారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టుకు బదిలీపై రానున్నారు.

9 మంది ఐఏఎస్‌ల బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతికుమారి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారుల వివరాలు ..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ
బి.గోపి	సీసీఎల్‌ఏ సెక్రెటరీ	కలెక్టర్, కరీంనగర్
ఆర్‌వీ కర్ణన్	===	కలెక్టర్, నల్లగొండ
టి.వినయ్‌కృష్ణారెడ్డి	కలెక్టర్, నల్లగొండ	రిపోర్ట్ టు జీఏడీ
వెంకటేశ్ దోత్రే	అడిషనల్ కలెక్టర్, మహబూబ్‌నగర్	అడిషనల్ కమిషనర్, జీహెచ్‌ఎంసీ
చెక్క ప్రియాంక	అడిషనల్ కలెక్టర్, పెద్దపల్లి	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) సూర్యాపేట
హేమంత కేశవ్ పాటిల్	====	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) ఆసిఫాబాద్
జల్ద అరుణశ్రీ	అడిషనల్ కలెక్టర్, కరీంనగర్	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) పెద్దపల్లి
ప్రఫుల్ దేశాయి	అడిషనల్ కలెక్టర్, జనగాం	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) కరీంనగర్
జి.రమేశ్	స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, యూఎల్‌సీ,హైదరాబాద్	అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్) మెదక్

సెల్‌ఫోన్ వాడుతోందని తలపై మోదాడు

అన్న చేతిలో చెల్లెలి మృతి

ఇల్లెందురూరల్: సెల్‌ఫోన్ విషయంలో అన్నాచెల్లెలి మధ్య మొదలైన ఘర్షణ చివరికి చెల్లెలి ప్రాణాలు తీసింది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ పరిధి రాజీవ్‌నగర్ తండాలో సోమవారం చోటుచేసుకుంది. ఏఎన్‌ఎంగా శిక్షణ పొందిన అజ్మీరా సింధు (23)ను సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని ఆమె సోదరుడు హరిలాల్ చెప్పినా వినిపించుకోలేదు. దీంతో సోమవారం సాయంత్రం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన హరిలాల్ రోకలిబండతో సింధు తలపై బలంగా కొట్టాడు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన సింధును కుటుంబీకులు ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె తలపై బలమైన గాయం ఉండటం, అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పత్రికల్లో కథనాలు రావడంతో పోలీసులు మంగళవారం విచారణ చేపట్టగా సోదరుడు కొట్టడమే కారణమని వెల్లడైంది. కాగా, నిందితుడు హరిలాల్ పరారీలో ఉన్నట్లు ఇల్లెందు సీఐ కరుణాకర్ తెలిపారు.

జిల్లా వార్తలు

వచ్చేనెల 4న కార్మిక గర్జన

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో వచ్చేనెల 4న నిర్వహించనున్న కార్మికగర్జనను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రామయ్య పిలుపునిచ్చారు. ఖమ్మంలోని పలు డివిజన్లలో మంగళవారం ప్రచారం చేసి ఆయన మాట్లాడారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల శ్రమతోనే పట్టణాలు పరిశుభ్రంగా ఉంటున్నాయని తెలిపారు. అయినప్పటికీ వారికి కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో 65 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తుండగా, తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రూ.వెయ్యి వేతనం పెంచుతున్నట్లు ప్రకటించినా ఇప్పటికీ ఇవ్వలేదని తెలిపారు. సమస్యల సాధన కోసం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యాన వచ్చేనెల 4న జరిగే కార్మిక గర్జనకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొయ్యల శ్రీనివాస్, దున్న గురవయ్య, జానయ్య, వెంకటనారాయణ, నాగరాజు, మైబుబ్, లాలమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ రాష్ట్ర, జిల్లా కమిటీలు రద్దు

సత్తుపల్లిటౌన్: తెలంగాణలో క్రిస్టియన్ల సంక్షేమానికి కృషి చేస్తున్న ఎన్‌సీసీ రాష్ట్ర కమిటీతోపాటు అన్ని జిల్లాల కమిటీలను రద్దు చేస్తున్నట్లు నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జాతీయ సెక్రటరీ జనరల్ సిల్వియ జయదీప్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రకటించారు. ఎన్‌సీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యాంపాల్, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ స్టీఫెన్ చిట్టిబాబు ఆధ్వర్యాన వచ్చేనెలలో రాష్ట్ర కమిటీని ప్రకటిస్తామని తెలిపారు. కాగా, మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి

మృతుడు మహబూబాబాద్ జిల్లా వాసి

కారేపల్లి: ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వచ్చిన ఆటో ట్రాలీ అతివేగంగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారి ఊట్కూరు స్టేజీ వద్ద మంగళవారం ఈ ప్రమాదం జరిగింది. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం కిష్టాపురానికి చెందిన సపావత్ శివ (30) ద్విచక్రవాహనంపై కారేపల్లి మండలం గాంధీనగర్ పాఠశాలలో తమ కుమారుడి సర్టిఫికెట్ల విషయమై వస్తున్నాడు. ఇదే క్రమంలో ఎదురుగా వచ్చిన ఆటోట్రాలీ ఊట్కూరు స్టేజీవద్ద ఢీకొట్టింది. ఈ ఘటనలో శివ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య సునీతతో పాటు ఇద్దరు కుమారులున్నారు. శివ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్‌ఐ రామారావు తెలిపారు.

విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్

- వినియోగం తగ్గడంతో కేటీపీఎస్‌లో 'బ్యాక్ డౌన్'
- ఉత్పత్తి సామర్థ్యం తగ్గించిన అధికారులు
- మరో మూడు నెలలు ఇదే పరిస్థితి


పాల్వంచలోని కేటీపీఎస్ కాంప్లెక్స్

పాల్వంచ: రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణంలో మార్పులు రాగా.. విద్యుత్ డిమాండ్ గణనీయంగా తగ్గుముఖం పట్టింది. ఈ ప్రభావం విద్యుత్ ఉత్పత్తి యూనిట్లపై పడింది. మరోవైపు అన్ని రిజర్వాయర్లలోకి భారీగా వరద చేరడంతో జల విద్యుత్ ప్రారంభించారు. ఫలితంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తిని తగ్గించాల్సి వచ్చింది. ఇందులో భాగంగా పాల్వంచలోని కేటీపీఎస్ కర్మాగారాల్లో ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించి బ్యాక్‌డౌన్‌లో నడిపిస్తున్నారు. అలాగే, మణుగూరు బీటీపీఎస్‌లో తడి బొగ్గు కారణంగా ఉత్పత్తి తగ్గింది. ఈ పరిస్థితి మరో మూడు నెలలు కొనసాగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

డిమాండ్‌తో పాటే తగ్గిన ఉత్పత్తి

వర్షాల కారణంగా వాతావరణం చల్లబడడంతో విద్యుత్ డిమాండ్ తగ్గింది. విద్యుత్ అవసరాలు గణనీయంగా పడిపోవడంతో పాటు వ్యవసాయ మోటార్లు సైతం నడవని కారణంగా రాష్ట్ర గ్రిడ్‌పై భారం పడడం లేదు. దీంతో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో అవసరం మేరకు మాత్రమే ఉత్పత్తిని తీసుకుంటూ.. ఆటోమేటిక్‌గా యూనిట్లు బ్యాక్‌డౌన్ చేయాలనే సంకేతాలు ఇస్తుంటాయి. దీంతో అక్కడక్కడా యూనిట్లు నడిపిస్తున్నప్పటికీ ఉత్పత్తిని బ్యాక్‌డౌన్‌లోకి తీసుకుంటారు.

కేటీపీఎస్‌లో ఇలా..

పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారం 9, 10వ యూనిట్లలో 250 చొప్పున 500 మెగావాట్లకు గాను ఒక్కో యూనిట్‌ను 185 మెగావాట్లతోనే నడిపిస్తున్నారు. ఇక 11వ యూనిట్ 500 మెగావాట్లకు గాను 350 మెగావాట్లను తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలో 800 మెగావాట్ల సామర్థ్యం కాగా, పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించలేని పరిస్థితి ఎదురవుతోంది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నడిపిస్తున్న ఈ కర్మాగారంలో పూర్తిస్థాయి సామర్థ్యంతో ఉత్పత్తి చేస్తే వైబ్రేషన్స్ ప్రభావం పడుతుండటంతో జెన్‌కో యాజమాన్యం నుంచి ప్రత్యేక అనుమతి తీసుకుని 700 మెగావాట్లకు కుదించి నడిపిస్తున్నట్లు తెలుస్తోంది.

తడిసిన బొగ్గు

వరుసగా వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మణుగూరులోని బీటీపీఎస్‌లో నిల్వ చేసిన బొగ్గు తడిసింది. అలాగే, సింగరేణిలోనూ బొగ్గు ఉత్పత్తి పడిపోయి సరిపడా సరఫరా కావడం లేదు. ఈ కారణంగా బీటీపీఎస్‌లో 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లలో 1,080మెగావాట్లకు గాను 700 మెగావాట్ల ఉత్పత్తి మాత్రమే నమోదవుతోంది. ఇక్కడ తడి బొగ్గు కారణంగానే ఉత్పత్తి తక్కువగా జరుగుతోందని బీటీపీఎస్ సీఈ బిచ్చన్న తెలిపారు.

విద్యుత్ డిమాండ్ తగ్గింది



వర్షాల కారణంగా విద్యుత్ డిమాండ్‌లో హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. ఈక్రమంలో విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు ఫుల్ లోడ్‌లో నడిపిస్తున్నా బ్యాక్‌డౌన్ తీసుకోవాల్సి వస్తోంది. జల విద్యుత్ ఉత్పత్తి పెరగడం, వ్యవసాయ అవసరాలు అంతంగా లేకపోవడంతో విద్యుత్ వినియోగం తగ్గింది.

–ఎం.ప్రభాకర్‌రావు, సీఈ, కేటీపీఎస్ 5, 6 దశలు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక శ్రద్ధ

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్


తేగడలోని అంగన్‌వాడీ కేంద్రం పిల్లలతో మాట్లాడుతున్న పీఓ జైన్

చర్ల: భారీ వర్షాలతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్న నేపథ్యాన గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉపాధ్యాయులు, అధికారులు శ్రద్ధ వహించాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ప్రతీక్ జైన్ ఆదేశించారు. చర్ల మండలంలో ని పలు ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ వైద్యశాల, అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆయన తని ఖీ చేశారు. ముందుగా చర్లలోని ఉంజుపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించిన పీఓ సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశమున్నందున విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు. కాగా, లైబ్రరీ నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో హెచ్‌ఎం సాయన్నను పీఓ మందలించారు. ఆ తర్వాత పెదమిడిసిలేరులోని బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశాక హెచ్‌ఎం చంద్రకళ, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అక్కడి నుంచి కొయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన చర్యలు చేపట్టాలని వైద్యాధికారి శ్రీధర్‌కు తెలిపారు. ఆ తర్వాత తేగడలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన పీఓ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ బి.భరణిబాబు పాల్గొన్నారు.

ముంపు నివారణ చర్యల్లో ప్రభుత్వం విఫలం


- భద్రాద్రిలో స్లూయీజ్‌ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి
- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వీరయ్య, జెడ్పీ చైర్మన్ కనకయ్య


ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరయ్య, జెడ్పీ చైర్మన్ కనకయ్య

భద్రాచలం: ఏటా గోదావరి వరదలతో ఏజెన్సీ ప్రాంత ప్రజలకు తీరని నష్టం జరుగుతున్నా ముందస్తు చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని భద్రాద్రి డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొదెం వీరయ్య, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ఆరోపించారు. భద్రాచలంలో మంగళవారం పర్యటించిన వారు కరకట్ట పైనుంచి గోదావరి వరద ఉధృతిని పరిశీలించి అధికారులతో వివరాలు ఆరా తీశారు. విస్తా కాంప్లెక్స్ వద్ద ఉన్న స్లూయిజ్‌ల నుంచి మురుగునీటిని గోదావరి నదిలోకి తరలిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం నన్నపనేని మోహన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరయ్య, జెడ్పీ చైర్మన్ కనకయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి భద్రాచలం ఏజెన్సీలో సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. గత ఏడాది ముంపు బాధితులను పరామర్శించిన సీఎం కేసీఆర్ వెయ్యి కోట్ల నిధులు ఇస్తామని ప్రకటించిన హామీ నెరవేరలేదని చెప్పారు. ఇకనైనా ఏజెన్సీలో ముందస్తు చర్యలు చేపట్టాలని, కరకట్ట, స్లూయిజ్‌ల లీకేజీ నివారణకు నిధులను విడుదల చేయాలని, శాశ్వత పునరావాస కేంద్రాలు, ముంపు ప్రజలందరికీ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో నాయకులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, సరెళ్ల నరేశ్, చింతిరేల రవికుమార్, భోగాల శ్రీనివాసరెడ్డి, బంధం శ్రీనివాస్‌గౌడ్, నవాబ్, ఎడారి ప్రదీప్, చింతిరేల సుధీర్, సరెళ్ల వెంకటేశ్, రాసమళ్ల రాము, పండాల సరిత తదితరులు పాల్గొన్నారు.

పాలకుల కుట్రకు బలైన విద్యారంగం

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, ఆజాద్



సమావేశంలో పాల్గొన్న రామకృష్ణ, ఆజాద్, నాయకులు

ఇల్లెందు: రాష్ట్రంలో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని ఇచ్చిన హామీని పాలకులు విస్మరించడంతో విద్యారంగం బలైందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామకృష్ణ ఎస్.ఆజాద్ పేర్కొన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు ఆగస్టు 12 నుంచి 14వ తేదీ వరకు ఇల్లెందులోని ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఇల్లెందులో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో వసతుల లేమి, ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యారంగం కుంటుపడుతోందని చెప్పారు. మన ఊరు – మన బడి కార్యక్రమంతో ప్రచార ఆర్భాటం తప్ప ఎలాంటి ప్రయోజనం లేదని ఆరోపించారు. ప్రైవేట్ యాజమాన్యాలు, కార్పొరేట్ సంస్థలతో మిలాఖత్ అయిన ప్రభుత్వ పెద్దలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేశారని తెలిపారు. కాగా, ఇల్లెందులో జరిగే రాజకీయ శిక్షణ తరగతుల్లో ఐక్య విద్యార్థి ఉద్యమాలకు ప్రణాళిక రూపొందిస్తామని రామకృష్ణ, ఆజాద్ వెల్లడించారు. పీడీఎస్‌యూ భద్రాద్రి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సంధ్య, కాంపాటి పృథ్వీతో పాటు రంగవల్లి, గణేశ్, సాయి, వంశీవర్ధన్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకొద్దాం


డ్రైవర్ల శిక్షణలో మాట్లాడుతున్న ఆర్‌ఎం వెంకన్న

ఖమ్మంమామిళ్లగూడెం: ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తూ ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకొచ్చేందుకు ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని ఖమ్మం రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న సూచించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఖమ్మం కొత్త బస్టాండ్‌లో మంగళవారం ఆర్టీసీ, అద్దె బస్సు డ్రైవర్లకు టాక్ పేరుతో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ సంస్థను నమ్ముకుని బస్సు ఎక్కిన ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందని తెలిపారు. కాగా, రోజుకు 100 మంది చొప్పున రీజియన్‌లోని డ్రైవర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం బి.ప్రసాద్, ఖమ్మం ఇన్‌చార్జ్ డీఎం దేవదానం, సీఐలు శ్రీనివాస్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.